

వనదుర్గ హుండీ ఆదాయం రూ.41.96 లక్షలు

పాపన్నపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వన దుర్గామాత ఆలయానికి 59 రోజుల్లో హుండీల ద్వారా రూ.41,96,612 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ ఈవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి సమక్షంలో ఆలయ సిబ్బంది, రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు ఆలయ సమీపంలోని గోకుల్ షెడ్‌లో శనివారం హుండీని లెక్కించారు. వెండి, బంగారం మినహా నగదు రూపంలో ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్, శ్యామ్, బ్రహ్మాచారి ఉన్నారు.

'విశ్వకర్మ చాలెంజ్' అదుర్స్

- ఐఐటీ హైదరాబాద్‌లో కార్యక్రమం
- దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన యువ ఆవిష్కర్తలు
- ప్రకృతి పరిరక్షణకు సృజనాత్మక ఆలోచనలు
- ఆకట్టుకున్న ఆవిష్కరణలు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు ఐఐటీ బాంబే 1975 బ్యాచ్ విద్యార్థులు మేకర్ భవన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న 'విశ్వకర్మ అవార్డుల'కు సంగారెడ్డి జిల్లా కందిలో ఐఐటీహెచ్ వేదికగా మారింది. ఐఐటీ హైదరాబాద్ స్టార్టప్ సంస్థ ఐటీఐసీ ఇంక్యూబేటర్ సంయుక్తంగా 'విశ్వకర్మ అవార్డ్స్-2024 చాలెంజ్'.. కోలాబరేట్, క్రియేట్ థీమ్ పేరిట ఈ నెల 8 నుంచి 20 వరకు వర్క్‌షాప్‌లను నిర్వహించారు. అందులో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థుల ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి.

7

రోడ్లపై గుంతలకు రబ్బర్ మ్యాట్‌తో చెక్

రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ఎస్‌ఆర్‌ఎం చెన్నై విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదివే విద్యార్థినీలు ఈశాని దీక్షిత్, ముక్తా మేధీలు ప్రత్యేకమైన రబ్బర్ మ్యాట్‌లను అభివృద్ధి చేశారు. మారుమూల గ్రామాల్లో ఎక్కడ చూసిన గుంతలతో ఇబ్బందుల పడుతున్న వాహనదారులే ఎక్కువగా ఉన్నారని, అందుకే తాము సిలికాన్, మెష్, రబ్బర్‌లను ఉపయోగించి తయారు చేసిన పాత్ హోల్ ఫిక్స్ మ్యాట్‌లతో ఒక్క నిమిషంలోనే గుంతలను పూడ్చవచ్చంటున్నారు. రోడ్డు ప్యాచ్ వర్క్‌లకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.



జై భీమ్ నినాదాలతో మార్మోగిన సంగారెడ్డి

- అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా భారీ ర్యాలీ చేపట్టిన జగ్గారెడ్డి
- దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ కార్యకర్తలతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ నాయకులతో కలిసి జగ్గారెడ్డి పూలమాలలు వేసి జైభీమ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సంజీవ్, సత్యనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ రాజగోపుర శుద్ధి

- నేటి సాయంత్రం నుంచి మల్లన్న మూలవిరాట్టు దర్శనం తాత్కాలిక నిలిపివేత
- ఈనెల 29న తెల్లవారుజామున పునఃప్రారంభం
- శరవేగంగా కల్యాణోత్సవం పనులు



రాజగోపురాన్ని శుద్ధిచేస్తున్న సిబ్బంది

చేర్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఈనెల 29న స్వామి వారి కల్యాణం జరగనున్న నేపథ్యంలో శనివారం రాజగోపురాన్ని శుద్ధి చేశారు. ఫైర్‌ఇంజన్‌ను రప్పించి నీటిపంపింగ్‌తో శుభ్రపరిచారు. గర్భాలయంలోని దేవతామూర్తుల మూలవిరాట్టును పంచరంగులతో అలంకరించేందుకు నేటి సాయంత్రం పూజానంతరం మూలవిరాట్టు దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. స్వామివారి కల్యాణం రోజున తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించిన అనంతరం గర్భాలయ ప్రవేశ దర్శనం ప్రారంభించనున్నారు. అప్పటివరకు భక్తుల దర్శనార్థం ఆలయ అర్థమండపంలో ఉత్సవ విగ్రహాలు నెలకొల్పనున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. శనివారం కొమురవెల్లి మల్లన్నను రాష్ట్ర షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులుతీర్చుకున్నారు. అలాగే సినీ, బుల్లితెర నటుడు సెల్వరాజ్, ఇటీవల రాచకొండ సీపీగా పదోన్నతి పొందిన సిద్దిపేట అడ్మిన్ డీసీపీ మల్లారెడ్డి మల్లన్నను దర్శించుకున్నారు.

సాధారణంగా గొడ్డు చాకిరీ.. గాడిద చాకిరీ అంటుంటాం.. కష్టమైన, బరువైన పనులను చేసే సందర్భంలో జనబాహుళ్యంలో ఈ పదాలు వాడుకలోకి వచ్చాయి. అదే బరువులను గుర్రంతో చేయిస్తే.. గుర్రం చాకిరి అనాలేమో..! రాను రాను రాజు గారి గుర్రం గాడిద అయ్యింది.. అనే సామెత వింటూనే ఉంటాం. ఏ సందర్భంలో ఈ సామెత పుట్టిందో తెలియదు కానీ.. ఇప్పుడు మాత్రం అది నిజమవుతున్నది. గుర్రంతో చేయిస్తున్న పనులను చూస్తే గాడిదే నయం.. అంటారేమో!



మెదక్ పట్టణంలో గుర్రాలతో ఇసుక రవాణా

గుర్రం చాకిరీ

- సంతల్లో గార్ధబాలు ప్రియం
- వాటి స్థానంలో గుర్రాల వినియోగం
- రజకులకు చేదోడుగా.. ఇసుక రవాణాకు వాడకం

అశ్వాల వైభవం నేడు కనుమరుగు.. రానురాను రాజు గుర్రం గాడిదలా..

మెదక్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజులెక్కిన గుర్రాల రాజసమే వేరు.. యుద్ధరంగంలో అశ్వాలనెక్కి వీరులు కత్తి తిప్పితే శత్రుసేనలు కకావికలమయ్యేవారు. రాజసానికి, దర్పానికి ప్రతీకగా నిలిచిన అశ్వాల వైభవం నేడు కనుమరుగైంది. కాలక్రమంలో అవి చేసే పనులే మారిపోయాయి. వివాహ వేడుకల్లో అశ్వంపై వరుడికి ఊరేగింపునకు.. అందంగా అలంకరించిన గుర్రపు బగ్గీలలో వధూవరులను ఊరేగిస్తూ పెళ్లి బరాత్‌లు చేసుకోవడం కనిపిస్తుంది. ఇలా గుర్రపు బగ్గీలు, పెళ్లికి గుర్రాలను అద్దెకిస్తూ ఉపాధి పొందుతున్నారు. గుర్రాలపై ఎక్కి తిరిగేందుకు చిన్నపిల్లలు సైతం ఎంతో ఇష్టపడుతుండడంతో పార్కుల వద్ద, జాతరల్లో గుర్రాలపై పిల్లలను తిప్పుతూ పొట్టపోసుకునే వారిని చూస్తుంటాం. ఇలా గుర్రాలతో ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నవారు అనేక మంది. కానీ, ఉపాధి కోసం గుర్రాలను.. గాడిదల కంటే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. రెండు అశ్వ జాతికి చెందిన జంతువులే అయిన వాటిని వినియోగిస్తున్న తీరును చూస్తే గాడిదో, గుర్రమో ఉపాధికి ఏదైతేనేం అనేలా ఉంది. మార్కెట్లో గాడిద ధరలు ఎక్కువ ధర పలుకుతుండడంతో వాటిల్లో సగం ధరకే లభిస్తున్న గుర్రాలను కొనుగోలు చేస్తూ గాడిదలతో చేయించే పనులను వాటితో చేయిస్తున్నారు.



ఇసుకను మోసుకెళుతున్న గుర్రాలు

పడిపోయిన గాడిదల సంఖ్య

ధర పెరగడంతో రజకులు సైతం గాడిదలకు ప్రత్యామ్నాయంగా గుర్రాలను వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణం ఒకప్పుడు గాడిదలకు ప్రసిద్ధి. ఈ పట్టణంలో ఏ మూల సందు గొందులో తొంగి చూసినా గాడిదలు తారసపడేవి. రజకులు తమ వద్ద పని ముగిసిన అనంతరం గాడిదలను వీధుల్లో వదిలేసేవారు. మెదక్ పట్టణంలో 3 వేల వరకు గాడిదలు ఉండేవని రజకులు చెబుతుంటారు. ప్రస్తుతం ఆ సంఖ్య పదుల్లోకి పడిపోయింది.

మిగతా 7వ పేజీలో

వేధింపుల ప్రిన్సిపాల్ మాకొద్దు

- అందోలు ఎస్సీ గురుకుల విద్యార్థినుల ధర్నా
- వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆందోళన
- కలెక్టర్ ఆదేశంతో అదనపు కలెక్టర్ విచారణ

జోగిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేధింపులకు గురిచేస్తోన్న ప్రిన్సిపాల్‌ను తొలగించాలని సంగారెడ్డి జిల్లా అందోలు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం ఆందోళన చేశారు. ఉదయం పాఠశాలలోని ప్రేయర్‌గ్రౌండ్‌లో ప్రిన్సిపాల్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ గుమికూడారు. అనంతరం పాఠశాల గేటు ఎదుటకు చేరుకుని బైఠాయించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తమతో పరుషంగా మాట్లాడుతున్నారని, తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, తన కారును కూడా తమతో కడిగిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు. తన గదిలోని బాత్రూంలను కూడా తమతోనే కడిగిస్తున్నారని, అదేమని ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారంటూ విద్యార్థినులు వాపోయారు. విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న ఆర్డీవో పాండు, తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దార్ సాగర్ మధుకర్‌రెడ్డి పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గేటు బయటకు రావొద్దని, ప్రహరీ లోపలే ఉండాలని సీఐ అనిల్ సూచించడంతో లోపలికి వెళ్లి ఆందోళన కొనసాగించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.మాణయ్య విద్యార్థినులకు సంఘీభావం తెలిపారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో ఆర్డీవో పాండు ఫోన్‌లో కలెక్టర్‌కు విషయాన్ని వివరించారు. కలెక్టర్ ఆదేశంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ గురుకులానికి చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్, టీచర్లతో వేర్వేరుగా మాట్లాడారు. తన విచారణలో గుర్తించిన విషయాలను కలెక్టర్‌కు నివేదిస్తానని, అప్పటివరకు ఓపికగా ఉండాలని విద్యార్థినులను సముదాయించడంతో ఆందోళనను విరమించారు.





అందోలు ఎస్సీ గురుకులం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు, విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రూ. కోటి విలువ చేసే డ్రగ్స్ పట్టివేత 7

మతం మారి ధర్మంపైనే దాడులు
- వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్‌సింగ్ 7

బోపాల్‌లో మెతుకుసీమ బిడ్డల ప్రదర్శన
- నేషనల్ బాల రంగ్ ఫెస్టివల్ 7

గీతంలో ముగిసిన సాంస్కృతిక కోలాహలం
- మూడు రోజుల ప్రదర్శన 6

ఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్, ఎస్పీతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం

మెదక్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈ నెల 25న రానున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆమె కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పర్యటనలో ఏలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో బుధవారం 25న మధ్యాహ్నం 2:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆర్గానిక్ వ్యవసాయంపై ఏర్పాటు చేసే స్టాళ్లను ఉపరాష్ట్రపతి పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని సీఎస్‌కు వివరించారు. ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

గవర్నర్, సీఎం పర్యటనలకు ఏర్పాట్లు

కొల్చారం/పాపన్నపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనల నేపథ్యంలో

మిగతా 8వ పేజీలో

అంబానీ, అదానీలకు కేంద్రం ఊడిగం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంబానీ, అదానీలకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫారుల ప్రకారం రైతులకు గిట్టుబాట ధరలు కల్పించకుండా కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ రైతులక నష్టం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్కరాములు, జిల్లా కార్యదర్శి జయరాజ్, నర్సింలు, యాదవరెడ్డి, నరసింహారెడ్డి, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏడు తరగతులు.. ఒక్కరే టీచర్

● 70 మంది విద్యార్థులు
● పాఠాలు చెబుతున్న సీనియర్లు
● వెంకట్రావుపేట బడి దుస్థితి


విద్యార్థులకు ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్

అల్లాదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యాబోధన కుంటుపడుతున్నది. ఏడు తరగతుల్లో కలిపి 70మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. దీంతో విద్యార్థులకు బోధన సరిగా జరగడంలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ముగ్గురు ఉపాధ్యాయులుండగా ఇద్దరు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో ఒక ఉపాధ్యాయురాలిని మాత్రమే నియమించడం.. ఆమె కూడా చైల్డ్‌కేర్ సెలవుపై వెళ్లడంతో కొన్ని రోజులుగా ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ఒక్కరే విద్యాబోధన చేస్తున్నారు. 6,7 తరగతులకు ఆయన పాఠాలు బోధిస్తుండగా, మిగతా తరగతులకు తోటి సీనియర్ విద్యార్థులే విద్యాబోధన చేయాల్సిన దుస్థితి నెలకొన్నది.

భోజనం కోసం కాదు.. బోధన కోసం పంపుతున్నాం : విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయుల కొరతపై శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క ఉపాధ్యాయుడితో విద్యాబోధన ఎలా సాధ్యమవుతుందని, ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను బడికి పంపించేది మధ్యాహ్న భోజనం కోసం కాదని, నాణ్యమైన విద్య కోసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని, లేకపోతే తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించుకుంటామని చెప్పారు.


పాఠం చెబుతున్న విద్యార్థిని

పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడికి తీవ్ర గాయాలు

గుమ్మడిదల డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలోని గ్రాన్ వెల్స్ పరిశ్రమ లో విద్యుత్ ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో విద్యుత్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బచ్చు షేక్ అనే కార్మికుడికి తీవ్ర గాయాల పాలయ్యారు. గురువారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదం సంబంధించినట్లు సమాచారం. వెంటనే పరిశ్రమ యాజమాన్యం గాయాల పాలైన వ్యక్తిని గుట్టుచప్పుడు కాకుండా సూరారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేపట్టారు. ప్రాణాపాయ స్థితిలో కార్మికుడు ఉన్నట్లు సమాచారం. ఈ

గుట్టు చప్పుడు కాకుండా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స

తరచూ ప్రమాదాలు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్

పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ పరిశ్రమపై తగు తనిఖీలు నిర్వహించి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మతం మారి ధర్మంపైనే దాడులు

● వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్‌సింగ్



శౌర్యయాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న రామ్‌సింగ్

జోగిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొంతమంది హిందువుగా ఉద్యోగాలు సంపాదించాక మతం మారి, హిందూ ధర్మంపైనే దాడి చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్‌సింగ్ ఆరోపించారు. శనివారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో శౌర్యయాత్ర పోస్టర్‌ను వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మత మార్పిడి పెరిగిపోతోందని ఆవేదన చెందారు. మతమార్పిడిని అడ్డుకునేందుకు, సనాతన ధర్మ పరిరక్షణకు సంఘ్ పరివార్ నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈనెల 25న జోగిపేట పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్యయాత్ర పేరిట భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 4 వేలమంది యువకిశోరాలతో పట్టణంలో ర్యాలీ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, నాయకులు చింత వెంకట్‌రెడ్డి, సుభాష్, మల్లేశ్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ప్రభుకుమార్‌గౌడ్, నాయకులు చిరంజీవి, సురేశ్, మనోజ్, కరుణాకర్, శ్రీకాంత్, మనోహర్ పాల్గొన్నారు.

భోపాల్‌లో మెతుకుసీమ బిడ్డల ప్రదర్శన



భోపాల్ లోప్రదర్శన ఇస్తున్న పాపన్నపేట విద్యార్థులు

పాపన్నపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వివిధ రాష్ట్రాల సంస్కృతీసంప్రదాయాలు విలువలు అందరికీ విస్తరించాలన్న ఉద్దేశంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో నేషనల్ బాల రంగ్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. ఈ ఫెస్టివల్‌లో తెలంగాణ నుంచి పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. గిరిజన సంప్రదాయాన్ని నృత్య రూపంలో ప్రదర్శించి అలరించారు. చక్కని వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. తీజ్ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రదర్శించారు. మొత్తం 29 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారి వెంట రాష్ట్ర కల్చరర్ కోఆర్డినేటర్ గిరి, ఈ నృత్యానికి కొరియోగ్రఫీ చేసిన తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్, ఉపాధ్యాయులు కృష్ణ కాంత్, ఇందిర ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నృత్య ప్రదర్శన చేసే అవకాశం రావడం పాఠశాలకు దక్కిన అపూర్వమైన గౌరవమని అన్నారు. జాతీయ స్థాయిలో నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, ఏఎంవో సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న రూపారాణి (ఫైల్)



ఆటపాఠాలు

ఆడిస్తూ, పాడిస్తూ లెక్కలు నేర్పుతున్న టీచర్ రూపారాణి

● లెక్కలపై మక్కువ పెంచేలా వినూత్న రీతిలో గణిత బోధన
● అనేక పురస్కారాలు ఆమె సొంతం

నేడు గణిత దినోత్సవం

కొండపాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచి 10వ తరగతి వరకూ కొందరి పిల్లల్లో గణితం అంటే భయం. వారిలోని ఆ భయాన్ని పోగొడుతూ వాళ్లకిష్టమైన ఆటపాటలతోనే వినూత్నంగా గణితం బోధన చేస్తున్నారు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసనగండ్ల ఉన్నత పాఠశాల గణిత టీచర్ పెందోటి రూపారాణి. విద్యార్థులకు లెక్కలపై మక్కువ పెంచేలా ఈజీ విధానంలో లెక్కలు నేర్పుతూ అందరి ప్రశంసలను పొందుతున్నారు. అందరిలా కాకుండా వినూత్నంగా ఆలోచన చేసి.. వెంటనే ఆచరణలో పెట్టి విద్యార్థుల్లోని మాథ్స్ ఫోబియా పారదోలి లెక్కలపై మక్కువ చూపే విధంగా బోధిస్తున్నారు టీచర్ రూపారాణి. అంకెలు, సంఖ్యలు, కొలతలు, వేగాలు అన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెబుతూ ప్రైవేటుకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. గ్రాఫ్ గేమ్స్, పాయింట్స్ చారుపత్ర, టక్కర్ మార్ ప్లాట్ ఏ పాయింట్, గ్రూప్ యాక్టివిటీస్ ఆన్ గ్రాఫ్, డయల్ యువర్ ఫార్ములా, మ్యాజిక్ ఫార్ములాస్, డెసిమల్ నంబర్ మీటర్, ప్రాపర్టీస్ ఆఫ్ సర్కిల్, నంబర్ లైన్ గేమ్స్ తదితర నమూనాలు తయారు చేసి విద్యార్థులలో గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టి ఆటల ద్వారా గణితాన్ని ఇష్టంగా నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

ఆడుతూ..పాడుతూ..

విద్యార్థులు ఆడుకునే చార్‌పత్తర్ ఆటతో గ్రాఫింగ్ పాయింట్లు ఎలా పెట్టవచ్చో చూపుతున్నారు. ఒక బాక్స్‌లో నాలుగు సమాన బాక్స్‌లు చేసి మధ్యలో నాలుగు రాళ్లు పెట్టి, వాటిని విద్యార్థులు తీసుకునే విధానం ద్వారా గ్రాఫింగ్ పాయింటింగ్ నేర్పిస్తున్నారు. మ్యాజిక్ ఫార్ములాతో సమస్యలు ఎలా సాధన చేయవచ్చో, సంఖ్య రేఖపై ఆటల ద్వారా కూడికలు, తీసివేత, గుణాంకాలను చేయడం, ఎలక్ట్రికల్ లైట్స్‌తో ప్రాపర్టీ ఆఫ్ సర్కిల్స్ ఇలా విద్యార్థులకు ఆటలతో అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తున్నారు. అంతేకాకుండా బతుకమ్మ పాటలతో ఎక్కాలను సులభంగా నేర్చుకునే విధంగా, యానిమేటెడ్ డిజిటల్స్ ద్వారా విద్యార్థులకు దృశ్య రూపకంగా సులభంగా అర్థమయ్యేలా చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు

ఈ ఏడాది సెప్టెంబర్ 5న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రూపారాణి అవార్డు అందుకున్నారు. అలాగే ఇటీవల సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి శాస్త్ర విజ్ఞానిక ప్రదర్శనలో ఆమె గైడ్ టీచరుగా ఉండి గణిత భావనలతో తయారుచేసిన ఎగ్జిబిట్లు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. గతంలో జాతీయస్థాయిలో సైతం గుర్తింపు లభించింది. 'జాయ్‌ఫుల్ లెర్నింగ్ బై మ్యాథ్స్ గేమ్స్ యూజింగ్ ఇన్నోవేటివ్ ఐడియాస్' అనే నమూనాతో రూపొందించిన ఎగ్జిబిట్స్‌కు గాను టీచర్ కేటగిరిలో రూపారాణి ఈ అవార్డు అందుకున్నారు. అలాగే అనేక చాప్టర్లలో యానిమేటెడ్ డిజిటల్ లెసన్స్‌ను ఆకర్షణీయంగా తయారు చేసి ఊహాత్మక భావనలను దృశ్య రూపంలోకి మార్చి యూట్యూబ్, వాట్సాప్ ద్వారా విద్యార్థులకు అందించిఉన్నతాధికారుల ప్రశంసలను అందుకున్నారు.

ఇష్టంగా నేర్చుకుంటున్నారు..

పాఠశాలల్లో తాను అనుసరిస్తున్న ఈ విధానంతో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగింది. గణితం అంటే పిల్లల్లో భయం పోయింది. విద్యార్థులకు ఆటల ద్వారా మ్యాథ్స్‌ను బోధిస్తుండడంతో విద్యార్థులు ఇష్టంగా నేర్చుకుంటున్నారు.

-రూపారాణి, గణితం టీచర్



రూపారాణి తయారుచేసిన గణిత నమూనాలు

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



సంజీవరెడ్డి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో ప్రభుత్వ ఉపాధాయయుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన అమ్మనగారి సంజీవరెడ్డి (59) రాయపోల్ మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. రోజులాగే శనివారం ఉదయం బైక్‌పై పాఠశాలకు వెళ్తుండగా తఢ్కపల్లి సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావమరిది దయాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి..

చిన్నశంకరంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గంగొల గురుపాదం(30) శుక్రవారం రాత్రి చేపలు పట్టేందుకు కృష్ణజింక కుంటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకుని నీట మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



సంపత్(ఫైల్)

ములుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం బైలంపూర్ గ్రామానికి చెందిన దర్శనం సంపత్(36) ఆరు సంవత్సరాల నుంచి మూర్ఛ(ఫిట్స్) వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం..

హవేళిఘణపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన ఘటన మదుల్వాయి గ్రామంలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గజ్జెల ఏసుకు చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. రూ.30 వేల నగదుతో పాటు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. దాతలు, ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ జ్యోతి ప్రవీణ్‌కుమార్ కోరారు.

గ్యాస్ సిలిండర్ పేలి..

చిన్నశంకరంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ప్యాటగడ్డ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ కొండాపూర్ మదిర గ్రామం ప్యాటగడ్డకు చెందిన రాతుల రాములు శుక్రవారం రాత్రి భోజనం చేసి నిద్రిస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేడంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రూ.5 వేలు, బంగారం, వెండి, ఇత ధ్రువపత్రాలు కాలి బూడిదయ్యాయి. బాధితుల వివరాలకు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.కోటి విలువ చేసే డ్రగ్స్ పట్టివేత

● ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చెన్నూరిరూపేష్, టీనాబ్ ఎస్పీ సాయిచైతన్య

పటాన్‌చెరు, డిసెంబరు, 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారులో పోలీసులు డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. ఢిల్లీలో కొనుగోలు చేసి న్యూఇయర్ వేడుకల్లో విక్రయించేందుకు తెచ్చిన వెయ్యి గ్రాముల నిషేధిత ఎన్‌డీఎంఏను పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో పట్టుకున్నారు. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.కోటి ఉంటుందని వెల్లడించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. శనివారం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, తెలంగాణ నాబ్ ఎస్పీ సాయిచైతన్య వివరాలను వెల్లడించారు. ముంబాయి ఇస్లాంపూర్ సమీపంలోని సూర్యానగర్‌కు చెందిన మహ్మద్ సలీం అబ్దుల్ హమీద్‌షేక్ (30), ముంబాయి విక్రోలీ వెస్ట్‌కు ప్రాంతానికి చెందిన ముకేష్‌దూబే (30), రయాజ్ రియాజ్ షేక్ (33) ఢిల్లీలోని జెర్రీ (40), జిమ్మీ (40) అనే నైజీరియన్ డ్రగ్స్ పెడ్లర్ల వద్ద ఎండీఎంఏను కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో హైదరాబాద్ బాలాపూర్ ప్రాంతానికి చెందిన షేక్ అమర్ అనే మరో డ్రగ్ పెడ్లర్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. తరచూ ముంబాయి వెళ్లి వారి నుంచి షేక్ అమర్ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటాడు. పది రోజుల క్రితం కూడా 320 గ్రాములు తెచ్చి విక్రయించాడు. ఈ క్రమంలో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా షేక్ అమర్ వెయ్యి గ్రాముల డ్రగ్స్‌ను ఆర్డర్ చేయగా, డెలివరీ చేసేందుకు ముంబాయి నుంచి మహ్మద్ సలీం అబ్దుల్ హమీద్ షేక్, ముఖేష్ దూబేలు శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో బృందం వలపన్ని నిందితులిద్దరిని పట్టుకున్నారు. ఈ డ్రగ్స్ డీలింగ్‌లో సంబంధాలు ఉన్న షేక్ అమర్‌తో పాటు రాయిజ్ రియాజ్ షేక్, నైజీరియన్ గ్యాంగ్ పరారీలో ఉన్నారు. వారిని సైతం పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

గీతంలో ముగిసిన సాంస్కృతిక కోలాహలం



పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 21 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు సాగిన సాంస్కృతిక కోలాహలం అసాధారణ కళాకారులు, మంత్రముగ్ధులను చేసింది. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని లలిత, ప్రదర్శన కళల (ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవం ఆహూతులను విస్మయగొల్పడమే కాకుండా, కరతాళ ధ్వనులతో సభా ప్రాంగణం మార్మోగిపోయేలా చేసింది. ఈ కార్యక్రమాన్ని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జోస్ ప్రారంభించారు. ప్రముఖ కళాకారులు ప్రదర్శన ఉర్రూతలూగించింది.

రాష్ట్రస్థాయి పోటీలకు సిద్దిపేట విద్యార్థులు



కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు సిద్దిపేట జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి భాగ్యరాజ్ తెలిపారు. శనివారం సిద్దిపేట ఇండోర్ స్టేడియంలో సీఎం కప్‌లో భాగంగా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జిల్లా యువజనశాఖ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు జరుగగా, కిక్ బాక్సింగ్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సిద్దిపేట కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు, ట్రెజరర్ స్వామి, కార్యదర్శి, కోచ్ పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా తైక్వాండో పోటీల్లో విద్యార్థుల సత్తా



తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన సిద్దిపేట విద్యార్థులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి):సంగారెడ్డి జిల్లా బీహెచ్ఈఎల్ టెంపుల్ ఆఫ్ ఆర్ట్స్‌లో జరిగిన సీఎం కప్ ఉమ్మడి మెదక్ జిల్లా తైక్వాండో ఎంపిక పోటీల్లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు సిద్దిపేట జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 2వరకు హైదరబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో జరగనున్న సీఎం కప్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

'విశ్వకర్మ చాలెంజ్' అదుర్స్

● ఐఐటీ హైదరాబాద్‌లో కార్యక్రమం
● దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన యువ ఆవిష్కర్తలు
● ఆకట్టుకున్న ఆవిష్కరణలు

కంది, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు 1975 బ్యాచ్‌కు చెందిన ఐఐటీ బాంబేలో చదివిన పూర్వ విద్యార్థులు మేకర్ భవన్ ఫౌండేషన్ ద్వారా మూడేళ్లుగా 'విశ్వకర్మ అవార్డ్స్'ను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ వేదికగా మేకర్‌భవన్ ఫౌండేషన్, ఐఐటీ హైదరాబాద్ స్టార్టప్ సంస్థ ఐటీఐసీ ఇంక్యూబేటర్‌లు సంయుక్తంగా విశ్వకర్మ అవార్డ్స్-2024 చాలెంజ్, కోలాబ్రేట్, క్రియేట్ థీమ్‌తో ఈ నెల 8 నుంచి 20 వరకు వర్క్‌షాప్‌లను నిర్వహించారు. నీరు-పారిశుద్ధ్యం, గ్రీన్-టెక్నాలజీ, స్మార్ట్-మొబిలిటీ సవాళ్లు, పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు పోటీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 278 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 526 దరఖాస్తులు అందాయి. వాటిల్లో 18 కళాశాలలకు చెందిన బృందాల ఆవిష్కరణలను ఎంపిక చేశారు. శనివారం ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ, ఎస్ఆర్ఎం చెన్నై విద్యాసంస్థలకు చెందిన యువ ఆవిష్కర్తలు గ్రీన్ -టెక్నాలజీపై తాము అభివృద్ధి చేసిన ప్రాజెక్ట్‌లను ప్రదర్శించినట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

సైకిల్ తొక్కితే గాలిలో కార్బన్‌డయాక్సైడ్ తగ్గుతుంది



ఐఐటీ బాంబేలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఆర్యన్‌గుప్తా, మోహిత్‌లు సైకిల్ తొక్కితే గాలిలో కార్బన్‌డయాక్సైడ్ తగ్గించేలా ఓ పరికరాన్ని అభివృద్ధి చేశారు. థర్మకోల్ బయో వ్యర్థాలతో తయారు చేసిన ప్రత్యేకమైన ఎరుపు రంగు పెల్లెట్స్‌ను ఈ పరికరంలో నింపారు. ఈ పరికరాన్ని ఏదైనా సైకిల్‌కు అమర్చి తొక్కితే బయట నుంచి గాలిలో ఉండే కార్బన్ డైయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌గా మార్చుతుంది. హైదరాబాద్ నగరంలో దీన్ని తొలిసారిగా అధ్యయనం సన్నాహాలు చేస్తున్నారు.

కాలుష్యాన్ని తగ్గించే బయోబల్బ్



ఇంటిలోని గదుల్లో గానీ, హాలులో గానీ ఉన్న గాలిలో కాలుష్యన్ని తగ్గించే బయోబల్బ్‌ను ఢిల్లీ స్కిల్ యూనివర్సిటి బయో ఇంజనీరింగ్ విద్యార్థులు ఆనంద్, చిన్మయ్‌లు తయారుచేశారు. ఒక హీటర్‌ను డబ్బాలో ఉంచి అందులోని ప్రత్యేకమైన రసాయనాలు పైపుల ద్వారా నీటిని శుద్ధి చేస్తూ గాలిలోని కాలుష్యాన్ని తగ్గిస్తాయి. ఈ ఒక్క బయోబల్బ్ 25 చెట్లు అందిచే ఆక్సిజన్‌కు సమానమని వారు తెలిపారు. ప్రస్తుతానికి ఇది ప్రయోగ దశలో ఉన్నదన్ని త్వరలోనే మార్కెట్‌కి అందుబాటులోకి రానుందని వెల్లడించారు.

వ్యవసాయ వ్యర్థాలతో ఇటుకలు, పలకలు

గోధుమ, వరి గడ్డిని, కొబ్బరిపీచు తాళ్లను ఉపయోగించి మంటలను. వర్షాన్ని తట్టుకునేలా కాంక్రీట్ కంటే ధృడమైన ఇటుకలు, పలకలను ఐఐటీ ఢిల్లీ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని కుసుమ్ సైనీ రూపొందించారు. సిమెంట్, స్టీలు ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో తాను రెండు సంవత్సరాలు పరిశోధనలు జరిపి ఈ వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి ఇటుకలు, పలకలు తయారు చేశానని కుసుమ్ సైనీ తెలిపారు. ఈ ఇటుకలు, పలకలతో త్వరలోనే ఐఐటీహెచ్‌లో, ఐఐటీ ఢిల్లీలో సెక్యూరిటీ క్యాబిన్‌లను నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు.



రెగ్యులర్ ఉద్యోగులకు కస్తూర్బా బాధ్యతలు

● ప్రతీ రోజు వచ్చి వెళ్తున్న ఎంఈవోలు

మెదక్ అర్బన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులు సమ్మెకు దిగడంతో పాఠశాలల అజమాయిషీ బాధ్యతలను తాత్కాలికంగా రెగ్యులర్ ఉద్యోగులకు అప్పగించినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఆయా పరిధిలోని ఎంఈవోలు ప్రతి రోజు విజిట్ చేస్తూ.. పర్యవేక్షిస్తారన్నారు. వంతుల వారీగా రోజుకు ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారని, విద్యార్థినుల బోధనకు, రక్షణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అన్ని కేజీబీలను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉంటే సమ్మెలో ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తున్నా తరగతులు నిర్వహించడం లేదు. హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేయడం లేదు. కేవలం విద్యార్థినులు విద్యాలయాలు వదిలి బయటకు వెళ్లకుండా, ఇతరులు లోపలకు రాకుండా ఉండటానికి రోజు ఇద్దరు చొప్పున హాజరవుతున్నారు.

రావి ఆకుపై గణిత మేధావి చిత్రం



నారాయణఖేడ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : భారత దేశానికి మంచి ప్రతిష్ఠను తెచ్చిపెట్టారు ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్. ఏటా డిసెంబరు 22న ఆయన జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం జరుపుకొంటారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకులపై శ్రీనివాస రామానుజన్ చిత్రాలు, రామానుజన్ సంఖ్య, గణిత సూత్రాలను వేసి గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గుర్రం చాకిరీ

5వ పేజీ తరువాయి

ఇప్పుడు మెదక్‌లో గాడిదలు అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి.

తక్కువ ధరకే గుర్రాలు

గాడిదల సంఖ్య తగ్గిపోతుండడంతో వాటికి బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఆరోగ్యంగా ఉండే గాడిదలు గుర్రం కన్నా అధిక ధర పలుకుతున్నాయి. గాడిద రూ.50వేలు ధర పలుకుతుంటే.. గుర్రం పాతిక వేలకే లభ్యమవుతోంది. దీంతో రజకులు కులవృత్తి పనులకు గాడిదలకు బదులుగా గుర్రాలను వినియోగించడం ప్రారంభించారు. ఒకప్పుడు ఏటిలో ఇసుకను గాడిదలపై బస్తాలతో తరలించేవారు. గృహనిర్మాణాలకు ఉపయోగించే సన్నని ప్లాస్టరింగ్ ఇసుకను ప్రత్యేకంగా సేకరించి గాడిదలపై దూర ప్రాంతాలకు రవాణా చేస్తూ వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం ఈ పనులను కూడా గుర్రాలతోనే చేయిస్తున్నారు. మెదక్ పట్టణ శివార్లలోని పసుపులేరు వాగు నుంచి గుర్రాలపై ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో గుర్రం మూడేసి ఇసుక బస్తాలను మోసుకెళ్తోంది. ఇలా అవసరార్థం గాడిదలు చేసే అన్ని పనులను గుర్రాలతో చేయిస్తుండడం గమనించవచ్చు.

న్యూస్ బాక్స్

చెక్కులు అందజేత

నారాయణఖేడ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండలం మునిగేపల్లికి చెందిన సత్యమ్మకు మంజూరైన రూ.30 వేలను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారు కుమారుడు కాశీరాంకు అందజేశారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ నవాబ్‌పటేల్ పాల్గొన్నారు. ఖేడ్‌కు చెందిన తస్వీర్‌బేగంకు మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును డీసీసీ ప్రధాన కార్యదర్శి అందజేశారు.

ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

కౌడిపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు ఆట పాటలతో అంగన్‌వాడీలో చదువు నేర్పడమే కాకుండా వారిలోని ప్రతిభన వెలికితీయడమే అంగన్‌వాడీల ప్రధాన లక్ష్యమని నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి అన్నారు. శనివారం మండల పరిధి మహ్మద్‌నగర్‌లోని రైతువేదికలోని అంగన్‌వాడీలో బాలమేళా సదస్సు నిర్వహించారు.

'సర్వే పూర్తిగా చేయాలి'

నర్సాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొదటగా పైలట్ ప్రాజెక్టు కింద నర్సాపూర్ పట్టణంలో 5వ వార్డును ఎంపిక చేసి లబ్ధిదారుల సర్వేను మధ్యలో నిలిపివేయడం తగదని జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడు, కౌన్సిలర్ సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కమిషనర్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

గుమ్మడిదల: కాంగ్రెస్ గుమ్మడిదల సీనియర్ నాయకుడు కుందుగారి రాంరెడ్డి శనివారం పార్టీకి రాజీనామా చేసి, తన కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ధర్మారంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

రామాయంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల పరిధి ధర్మారంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం జరిగింది. గ్రామంలో కొంతకాలంగా ఈ ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా ఉదయం వేడుకలు వైభవంగా సాగాయి. గ్రామంలోని మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఉత్సవంలో పాలుపంచుకున్నారు.

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

చేగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మణిరామ్‌రాథోడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ మెదక్ అధ్యక్షుడు జీ.శ్రీనివాస్, జిల్లా అడక్ కమిటీ కన్వీనర్ నాగుల్‌మీరా అధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రవిబాబు, మాధురి, ప్రధాన కార్యదర్శిగా నగేష్ ఎన్నికయ్యారు.





విద్యుత్ స్తంభం మీదికి ఎక్కిన వెంకట్, బాధితుడితో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్

- జగ్గారెడ్డి వచ్చేదాకా కిందికి దిగను
- కుటుంబ సమస్యతో..
  2 గంటల పాటు ఉత్కంఠ వాతావరణం
- సముదాయించి కిందకి దింపించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు 33/11 కేవీ విద్యుత్ స్తంభం పైకి ఎక్కి చనిపోతానని బెదిరించిన సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో శనివారం ఉదయం చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన వెంకట్ అలియాస్ వినోద్(26) కుటుంబ సమస్యల కారణంగా పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఉన్న 33/11 కేవీ విద్యుత్ స్తంభాన్ని శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఎక్కాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు తన సమస్యలు పరిష్కరించాలని, ఇక్కడికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలు వస్తేనే తాను కిందికి దిగుతానని, లేకుంటే కరెంట్ తీగ పట్టుకుని చనిపోతానని, కిందికి దూకేస్తానని బెదిరిస్తూ ఓ చీటి రాసి కిందికి పడేశాడు. దీంతో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ ఎస్.రమేష్ తో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్ తదితరులు అతనికి ఫోన్‌చేసి నచ్చజెప్పినా వెంకట్ వినలేదు. దాదాపు రెండు గంటల పాటు ఉత్కంఠగా కొనసాగిన ఈ ఘటనతో పట్టణంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఘటనా స్థలానికి వచ్చి అతనితో మాట్లాడటంతో కిందకు దిగాడు. ఏ సమస్య ఉన్నదని తెలుసుకోగా, తనకు ఉద్యోగం ఇప్పించాలని వెంకట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని కోరారు. దీంతో కుటుంబ సమస్య పరిష్కరిస్తానని, ఉద్యోగం కల్పిస్తానని జగ్గారెడ్డి హామీఇచ్చారు. అనంతరం వెంకట్‌ను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరావు

పాపన్నపేట/చేగుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. 25న సీఎం జిల్లా పర్యటనకు పురస్కరించుకుని శనివారం ఏడుపాయల ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారి దర్శనం అనంతరం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ... ఏడుపాయల, జిల్లాలోని పలు అభివృద్ధి పనుల నిధుల గురించి సీఎం దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం మెదక్‌కు వెళ్తూ చేగుంట మండల కేంద్రంలో ఆగి కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్, రెడ్డిపల్లి సొసైటీ మాజీ చైర్మన్ వెంగల్‌రావు, కాంగ్రెస్ అధ్యక్షురాలు గొల్ల లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభస్వామి ఆలయ అభివృద్ధికి కృషి: భిక్షపతి

పుల్‌కల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం చక్రియాలలో వెలసిన లక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి హామీఇచ్చారు. శనివారం పద్మనాభస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పద్మనాభస్వామి ఆలయ పునశ్చరణలో భాగంగా 42 అడుగుల ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించారు. పక్కనే ఉన్న స్వామివారి కోనేరును పరిశీలించి పూర్వ వైభవం తీసుకురావాలని ఆలయ కమిటీ పాలకవర్గానికి సూచించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మహారాజుల రామకృష్ణశర్మ ఆయనకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనలు అందజేశారు. మఠం భిక్షపతిని ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మణ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, సత్యానారాయణ, సర్పంచుల ఫోరం ఉమ్మడి పుల్కల్ మండలం మాజీ అధ్యక్షుడు బక్కారెడ్డి కిష్టారెడ్డి శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట సుల్తాన్‌పూర్ మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ముద్దాయిపేట సతీష్‌కుమార్ ఉన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



క్యాంపు సభ్యులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రామచంద్రాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రొమ్ము క్యాన్సర్ విషయంలో 40 ఏళ్లు పైబడిన మహిళలు జాగ్రత్తలు వహించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏఐజీ ఆసుపత్రి, గ్రాన్యూల్ ఫార్మ ఇండియా, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్(తెనా) సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్‌శాఖ సహకారంతో బ్రెస్ట్ క్యాన్సర్ క్యాంపును శనివారం నిర్వహించారు. ఈ క్యాంపును కమిషనర్ సంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బీ.రాములుగౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. ఏఐజీ వంటి సంస్థ ముందుకు వచ్చి రూ.5 వేల విలువచేసే పరీక్షలు ఉచితంగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఏఐజీ హెచ్‌వోడీ ప్రజ్ఞ చిగురుపాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసమూర్తి, అమూల్య, తెనా అధ్యక్షుడు రమణ, ఏఐజీ టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర 'శిక్ష'లా ఉద్యోగుల పరిస్థితి

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగుల చేస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద శనివారం మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి అనిల్‌చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం సడక్ పే చదువు అని పుస్తకాలు పట్టుకుని రోడ్డుపై బైఠాయించి, వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.

మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలి

జహీరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మాదిగలకు మంత్రి పదవులు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి కోళ్ల శివమాదిగ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన వర్గీకరణ తీర్పును అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జనవరి 27లోపు వర్గీకరణపై ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకోకపోతే హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై కవాతు నిర్వహిస్తామన్నారు.

ఫ్రీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫ్రీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, మాజీ ఎంపీటీసీలు, పండరిరెడ్డి, ముంతాజ్, తాహేర్, అర్జున్, శంకర్ ముదిరాజ్, పాస్టర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు: సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైనా విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలమని ఎస్పీ రూపేష్ అన్నారు. ప్రొబేషనరీ సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లకు వీక్లీ పరేడ్‌తో పాటు వివిధ సెక్షన్ డ్యూటీలు, వర్టికల్ విభాగం క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌పై శనివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రతిఒక్కరూ అన్నివిభాగాల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసులకు ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, ఆర్ఐలు రామారావ్, రాజశేఖర్‌రెడ్డి, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తాచాటాలి: బీజేపీ

మెదక్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో అధిక సంఖ్యలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని, జిల్లాలో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఎన్నికల అధికారి మీసాల చంద్రయ్య, సభ్యత్వ ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ గురుకుల లా కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేపీ.నిరీక్షణరావు తెలిపారు. కళాశాల విద్యార్థులు ఏ.వరప్రసాద్, జే.చంటి. పీ.ఆకాష్ 65 కేజీ, 70, 74 కేజీల రెజ్లింగ్‌లో అండర్-20 విభాగం రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, అథ్లెటిక్ విభాగంలో వందమీటర్ల పరుగు పందెంలో సీనియర్ ఓపెన్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు కే.వనియ్‌కుమార్ అర్హత సాధించారన్నారు. 27 నుంచి జనవరి 2వ తేదీవరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ప్రిన్సిపాల్ నిరీక్షణరావుతో పాటు ఫిజికల్ డైరెక్టర్ వి.జయపాల్‌సింగ్ అధ్యాపకులు అభినందించారు.

రెండోరోజూ విద్యార్థుల ఆందోళన

శివ్వంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడి బదిలీ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు మండల పరిధిలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు శనివారం తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎంఈవో బుచ్చానాయక్‌కు హెచ్‌ఎం దురుసుగా ప్రవర్తిస్తుందని విద్యార్థులు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేష్ బదిలీని నిలిపేయాలని విద్యార్థులు వేడుకున్నారు. డీఈవో దృష్టికి తీసుకెళ్లి రెండు, మూడురోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈవో చెప్పినట్లు తెలిపారు.



జహీరాబాద్ పట్టణంలోని క్రిష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లిలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గణిత దినోత్సవం

మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్

ఉపరాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి

మెదక్ జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొల్చారం సాంఘిక సంక్షేమ పాఠశాలను గవర్నర్ సందర్శించనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. అలాగే ఏడుపాయలలో సీఎం పర్యటన ఏర్పాట్లను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. కొల్చారంలో గవర్నర్ రాక మొదలుకుని కార్యక్రమాలు పూర్తిచేసుకుని తిరిగి బయలుదేరే వరకూ షెడ్యూల్ ప్రకారం సాగేలా ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఏడుపాయలలో హెలిప్యాడ్, పార్కింగ్, సీఎం పర్యటించే ప్రదేశాలను ఆయన పరిశీలించారు. బందోబస్తుపై అధికారులకు సూచనలు చేశారు.

ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు

జిన్నారం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిర్వహించే పోరాటాలు, ఆందోళనలకు కార్మికవర్గం అండగా నిలవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం కాజీపల్లి టీఐడీసీ పరిశ్రమ కార్మికులు చుక్క రాములును కలిసి జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహా సభలకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, యూనియన్ నాయకులు భాస్కర్‌రెడ్డి, శేఖర్, వీఎస్ రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బాలికలు సమాన అభివృద్ధి సాధించాలి'

నారాయణఖేడ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లోనూ బాలికలు సమాన అభివృద్ధిని సాధించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి లలితాకుమారి అన్నారు. శనివారం ఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, నాగల్‌గిద్ద కేజీబీవీ పాఠశాలలో శనివారం బేటీ బచావో..బేటి పడావో కార్యక్రమాలను నిర్వహించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఆర్డీవో అశోకచక్రవర్తి, సీడీపీవో సుజాతతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఖేడ్ మండలం అనంత్‌సాగర్ అంగన్‌వాడీ కేంద్రం, చైల్డ్ హోంలను తనిఖీ చేశారు.

ఐక్యంగా దాడులను ప్రతిఘటించాలి : సీపీఎం

నారాయణఖేడ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్మిక, ఉద్యోగుల హక్కులపై ప్రభుత్వాల దాడిని ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. శనివారం ఖేడ్‌లో ప్రభుత్వాల విధానాలు, కార్మికులు, ఉద్యోగులపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగుల హక్కులపై తీవ్రమైన దాడి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, ఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి'



సెయింట్ పీటర్స్ స్కూల్ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆంథోనీరెడ్డి, ఈశ్వారెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సేల్స్ ఫోర్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ బాధ్యులు దీప్, గౌరవ్ అన్నారు. శనివారం ఖేడ్‌లోని జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలు, నిజాంపేట మండలం ర్యాలమడుగు ఉన్నత పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, దేవిసింగ్‌యాదవ్, ఉపాధ్యాయులు వెంకట్‌రావు, రాజశేఖర్, చంద్రశేఖర్, రాజయ్య, వినయ్‌కుమార్, హమీద్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

'సుస్థిర అభివృద్ధి'పై అవగాహన

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యం' అనే కార్యక్రమంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2015లో ఐక్య రాజ్యసమితి సభ్య దేశాలన్నీ స్థిరమైన అభివృద్ధి కోసం పేదరికం నిర్మూలించడం, అసమానతలు తగ్గించడం, పర్యావరణాన్ని రక్షించడం లక్ష్యంగా పెట్టుకుని 2030 నాటికి వాటిని సాధించడానికి ప్రపంచదేశాలు కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా తమవంతు ప్రయత్నంగా భావించి విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఆంథోనీరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈదర ఈశ్వారెడ్డి, ప్రిన్సిపాల్ రవికుమార్‌రెడ్డి, లీడ్ అకాడమీ ఎక్సలెంట్ మేనేజర్ వరలక్ష్మి సందీప్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు స్వర్ణ, రజత పతకాలు

మునిపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 16 నుంచి 21వ వరకు సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడల్లో బుదేరా చౌరస్తాలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రభావతి (కబడ్డీ), జెరుష (అథ్లెటిక్స్ 100మీ), సౌజన్య (అథ్లెటిక్స్ 400మీ), హ్యాండ్‌బాల్ పోటీల్లో శారద, రాధిక, రూప, కల్పన స్వర్ణ, రజత పతకాలు సాధించారు. ఈనెల 24 నుంచి 27 వరకు తమిళనాడులో జరిగే 46వ జూనియర్ నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు కల్పన ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారుల స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన యాప్ డేటాలో తమ పేరు మిస్ చేశారని మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన బాధిత దంపతులు కూడారం కావ్య,పెంటయ్య న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన విషయం విధితమే. ఈ విషయమై అధికారులు స్పందించారు. ఎంపీడీవో నాగేశ్వర్ ఆదేశాలతో గుండ్లపల్లి కార్యదర్శి సంతోష్‌కుమార్ గుల్లపల్లికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి, తప్పిదాన్ని సరిచేశారు.

వెల్‌నెస్, డీఈఐసీ కేంద్రాల్లో నల్లాల చోరీ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని వెల్‌నెస్ సెంటర్, డీఈఐసీ కేంద్రాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నల్లాల చోరీకి పాల్పడ్డారు. ఆయా కేంద్రాల్లో గురు, శుక్రవారాల్లో రాత్రి సమయాల్లో ఈ చోరీలు జరిగినట్లు ఉద్యోగులు అనుమానిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్‌తో పాటు డీఈఐసీ కేంద్రానికి వెళ్లేందుకు ఉండే ఒకే గేటు తాళాలు పగులగొట్టి బాత్రూమ్‌లల్లో నల్లాలు ఎత్తుకెళ్లినట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని, అంతేకాకుండా పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఉద్యోగులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

శివ్వంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లోంచి వెళ్లి వ్యక్తి మృతదేహం చెరువులో తేలిన ఘటన గోమారంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడకు చెందిన విక్రమ్(30) ఈ నెల 18న భోజనం చేసి పడుకున్నాడు. 19న ఉదయం భార్య సునిత లేచిచూసేసరికి భర్త కనిపించలేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా గోమారం చెరువు సమీపంలో విక్రమ్ బట్టలు, చెప్పులు, ఫోన్ లభించడంతో దాని ఆధారంగా చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెంది ఉంటాడని భావించారు. కాగా శనివారం విక్రమ్ మృతదేహం తేలడంతో బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

కార్మికుడి అదృశ్యం

శివ్వంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్మికుడు అదృశ్యమైన సంఘటన శనివారం చోటు చేసుకున్నది. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన మునిగే దినేష్‌రెడ్డి(25) కండ్లకోయ సమీపంలోని పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే 19న పరిశ్రమకు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి తిరుపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.